క్లుప్తంగా

సంస్కరణలకు వ్యతిరేకంగా నిరసన


నిరసన ప్రదర్శన చేస్తున్న సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అఖిల భారత విద్యాహక్కువేదిక పిలుపులో భాగంగా ఏపీ ఎస్ఈసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీఎస్ఈసీ భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాలైన ఏపీటీఎఫ్ 1938, డీటీఎఫ్, విద్యార్థి సంఘాలైన పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వీడీ ప్రసాద్

ఏలూరు (టూటౌన్): గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎస్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు కోటయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గత 10, 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగించడం అన్యాయమని అన్నారు. రేపు ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయింపులు పెంచాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి శివకృష్ణ, సతీష్, సురేష్ పశ్చిమగోదావరి జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, ఏడుకొండలు మాట్లాడారు.

పారదర్శకంగా ఎరువుల పంపిణీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా సరఫరా చేశామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సీహెచ్ ప్రసాద్ గుప్తా తెలిపారు. డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 30,262 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని అన్నారు.

లోబ్రిడ్జి ప్రయాణం ప్రమాదకరం


ఫుట్‌పాత్‌పై ఉన్న కంకర

- రాత్రి వేళ చీకటిమయం
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- ప్రయాణికుల ఆవేదన

ఏలూరు రూరల్ : ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద రైల్వే లోబ్రిడ్జి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. విద్యుత్ లైట్లు, ప్రమాద సూచకలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంపైతో రాత్రి వేళ చీకటిలో ప్రజలు బిక్కుబిక్కుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుంది. రైల్వే, కార్పొరేషన్ రోడ్లు, ఎలక్ట్రికల్ శాఖ అధికారుల సమన్వయలోపం, నిర్లక్ష్యాన్ని ప్రయాణికులు తప్పుపడుతున్నారు. లోబ్రిడ్జి ప్రాంతంలో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు సంకేతం

లోబ్రిడ్జికి రెండు వైపులా కనీసం వీధిలైట్లు లేకపోవడంతో సాయంత్రం వేళ బ్రిడ్జి అంతటా చీకటి కమ్ముకుంటుంది. పగటి పూట ప్రయాణం సాఫీగా సాగిన, రాత్రి వేళ చీకటిలో బిక్కుబిక్కుమంటూ వాహన చోదకులు, పాదచారులు భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. మోటార్ బైక్స్, ఆటోల హెడ్ లైట్లు వెలుగులో ప్రయాణించాల్సి వస్తుంది. గతంలో రైల్వే అధికారులు బ్రిడ్జి కింది నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా రోడ్డుకు రెండువైపులా భారీ గడ్డర్లను ఏర్పాటు చేశారు. చీకటిలో ఈ గడ్డర్లు డ్రైవర్లకు కనిపించడం లేదు. కొద్ది వారాల క్రితం మినీ బస్సు డ్రైవర్ బ్రిడ్జి కింద నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా, స్థానికులు గడ్డర్ల విషయం చెప్పడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే బస్సు బ్రిడ్జి కింద చిక్కుకుపోయేది. చీకటిలో


ఫుట్‌పాత్‌పైనే తొలిగించిన గడ్డర్


రాత్రివేళ చీకటి కమ్మిన రైల్వే లోబ్రిడ్జి

ఫుట్‌పాత్ కనబడడక పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం రైల్వే అధికారులు, సిబ్బంది బ్రిడ్జిపై నుంచి కంకర రాళ్ల ఫుట్‌పాత్‌పై గుట్టలుగా పోశారు. రాత్రివేళ్ల ఈ గుట్టలు కనిపించకపోవడంతో బైక్‌పై వెళుతున్న చోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు.

ఫ్లడ్‌లైట్లు ఏర్పాటుచేయాలి



బ్రిడ్జి కింద నుంచి రాత్రివేళ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జి దాటిన తర్వాత కూడా రోడ్డు దాటడం కష్టంగా ఉంది. భారీ వాహనాలకు అడ్డుగా ఏర్పాటుచేసిన గడ్డర్లు సైతం స్పష్టంగా కనిపించడం లేదు. వీటికి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా అధికారులు చూడాలి.

– అతీక్, వాహన చోదకుడు

చీకటి పడితే నడవలేం



రాత్రివేళ ఈ బ్రిడ్జి కింద నుంచి నడవలేం. రెండు వైపులా ఫుట్‌పాత్ ఉంది. దీనిపై రైల్వే అధికారులు కంకర రాళ్లు పోశారు. దీంతో పట్టాలపై నుంచి పోవాల్సి వస్తుంది. దీంతో మహిళలు రైలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు ఫుట్‌పాత్‌పై నడిచేందుకు అనువుగా లైట్లు ఏర్పాటుచేయాలి.

– వి.లీల, స్థానికురాలు

పేదల సొంతింటి కల నెరవేర్చాలి


అర్జీల స్వీకరణలో పాల్గొన్న డేగప్రభాకర్ తదితరులు

ఏలూరు (టూటౌన్): కూటమి నేతలో ఎన్నికల సమయంలో పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి, పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ, ఏలూరు 28వ డివిజన్ శాఖ కార్యదర్శి మావూరి విజయ, బీకే ప్రసాద్ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలను పెంచి ఇవ్వాలని శుక్రవారం రెండో రోజు అర్జీల నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 10న పూర్తి చేసిన అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సభ్యులు బళ్ల కనక దుర్గారావు, బి.శ్రీదేవి, ఆలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళా వారసత్వానికి ప్రతీక వైఎంహెచ్ఏ హాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వైఎంహెచ్ఏ హాలు 120 ఏళ్ల కళా వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆధునీకీకరించిన హిందూ యువ జన సంఘం (వైఎంహెచ్ఏ హాలు) ఎయిర్ కండిషన్‌హాలును శుక్రవారం ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. దాతలను సంస్థ తరపున సత్కరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సంస్థ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కమిటీ అధ్యక్షులు జవ్వాజి మోహన్ విఠల్ మాట్లాడారు.

శ్రీవారి క్షేత్రంలో అన్నప్రాశనల సందడి

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శుక్రవారం చిన్నారుల అన్నప్రాశన వేడుకలతో కళకళలాడింది. మాఘమాసంలో మంచి ముహూర్తం కావడంతో పెద్ద ఎత్తున ఈ వేడుకలను నిర్వహించారు. క్షేత్ర పరిసరాల్లో సందడి నెలకొంది. పలు ప్రాంతాల భక్తులు ముందుగా తమ చిన్నారులతో ఆలయ అనివేటి మండపంలోకి చేరుకున్నారు. అక్కడ పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఈ అన్నప్రాశనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వారి సేవలు అభినందనీయం


హోంగార్డులను సత్కరించిన అదనపు ఎస్పీ, పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి, నిబద్ధతతో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు, హోంగార్డుల సేవలు అభినందనీయమని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ చేసిన ఏలూరు సీసీఎస్ ఎస్సై ఏసీహెచ్ శేఖర్, టూటౌన్ ఏఎస్సై టి.బ్రహ్మానందం, పెదవేగి ఏఎస్సై బీవీఎస్ మూర్తి, హోంగార్డులు చుక్క మోషే, ఎన్ ఏసుబాబు, జి.దేవదాసు, సీహెచ్‌వీ బ్రహ్మయ్యలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. వీరికి అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హోంగార్డు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం సంయుక్త కార్యదర్శి శానం రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.


పోలీస్ అధికారులను సత్కరించిన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, సంఘం ప్రతినిధులు

పిల్లలను పాఠశాలలకు పంపించండి


సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు (టూటౌన్): పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ తల్లిదండ్రులను కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ నగర్‌లో శుక్రవారం అవగాహన ర్యాలీ అనంతరం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని సూచించారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జి.నాగేశ్వరావు, డీసీపీఓ సూర్య చక్రవేణి, సీఐ ఎ.సత్యనారాయణ మాట్లాడారు. చదువుకోవడం ద్వారా జ్ఞానం వస్తుందని, జ్ఞానం భవిష్యత్తుకు పునాది వేస్తుందని వివరించారు. తొలుత 17, 18 రోడ్లలో ఉన్న తల్లిదండ్రులను కలిసి వారికి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాల పంపించాలని కోరారు. ఏఎల్ఎస్ఏ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు జీజేఏ స్టీవెన్, జరీనా, కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాతకు పూజలు


వాసవీ మాతకు సారి సమర్పిస్తున్న ఆలయ ఈఓ నాగమునేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో విశేష పూజలు చేశారు. స్థానిక అగ్రహారంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి స్వర్ణ వస్త్రాలంకరణ చేశారు. దేవదాయ శాఖ ప్రతినిధులు అమ్మవారికి విశేష సారి సమర్పించారు. అనంతరం ఆలయంలో సుమారు 500 మంది మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అన్నసమారాధనలో సుమారు 2500 మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. అర్చకుడు రాధాకృష్ణ శర్మ పూజలు చేయగా, ఆర్యవైశ్య ప్రముఖులు అంబికా రాజా, పైడి భీమేశ్వరరావు, తూతా శ్రీనివాసరావు, కొనకళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యనిర్వహణాధికారి నాగ మునేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌కే బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎకో గ్రీన్ యూనిట్ సంస్థ కృషి చేస్తోందని తమిళనాడులోని కోయంబత్తూరు పరిశ్రమల అభివృద్ధి అధికారి ఎస్‌కే బాబు అన్నారు. స్థానిక కందకం వీధిలో మహిళలకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 17 రాష్ట్రాల్లో ఎకో గ్రీన్ యూనిట్ అరికా లీఫ్ ప్లేట్ల తయారీ ప్రాజెక్ట్, బనానా ఫైబర్ ప్రాజెక్ట్, హస్తకళల ప్రాజెక్ట్, వెదురు హస్తకళల తయారీ ప్రాజెక్ట్, కొబ్బరి చిప్పల క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్ట్, కోయిర్ కుండీల తయారీ ప్రాజెక్ట్, బయోదార్ మేకింగ్ ప్రాజెక్ట్, లావంచ సాగు ప్రాజెక్టులపై రైతులు, మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఆయా ప్రాజెక్టులకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ, మార్కెటింగ్ పరంగా మద్దతు ఇస్తూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని, ముద్రా బ్యాంకు పథకం, వివిధ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్కీమ్‌ల ద్వారా బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొర్లక వల్లి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ద్వారకాతిరుమల: స్థానిక మార్కెట్ యార్డులో వేంకటేశ్వర నిమ్మకాయల వర్తక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దొరసానిపాడుకు చెందిన చిట్టిబొమ్మ గంగాధరరావు మొత్తం 47 ఓట్లకు గాను, 19 ఓట్ల మెజారిటీతో గెలుపొంది, సంఘ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా మద్దిపాటి సోమేశ్వరరావు (దొరసానిపాడు), ట్రెజరర్‌గా అబ్బూరి శ్రీనివాసరావు (వెంకట కృష్ణాపురం), సభ్యులుగా వనమట్ల శివశంకర్ (గుండుగొలనుకుంట), సర్నాల సోమరాజు (వెంకట కృష్ణాపురం), ఘంటా శ్రీనివాస్ (తిమ్మాపురం), ఒంటిపల్లి జోషి (కామవరపుకోట మండలం ఈస్టు యడవల్లి), పాకలపాటి భాస్కర సురేష్ (వెంకటకృష్ణాపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. రెండేళ్లపాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని సంఘ నూతన అధ్యక్షుడు గంగాధరరావు తెలిపారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ


అమ్మవారిని దర్శించుకున్న కమిటీ సభ్యులు


ఉత్సవాలకు సిద్ధమైన మండపం

దెందులూరు: కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పాలిట కొంగు బంగారంగా సంతాన లక్ష్మిగా, చల్లని తల్లిగా పేరొందిన దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను ఫిబ్రవరి 4వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఇప్పటికే ఆలయం చుట్టూ భారీగా వివిధ రకరకాల విద్యుదీపాలు అలంకరించి చిత్ర విచిత్ర ఆకర్షణతో ఉండే బొమ్మలతోపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటితోపాటు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కమిటీ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను ఫిబ్రవరి 4న ఉత్సవాల సందర్భంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని మంగళవారం 4 తేదీ పసుపుతో అలంకరణ, 5న నిమ్మకాయలు, పసుపు కుంకుమార్చన, శుక్రవారం గాజులతో, శనివారం గంధంతో, ఆదివారం నెమలి పింఛంతో, సోమవారం పూలతో ప్రత్యేక అలంకరణ, మంగళవారం గాలాయగూడెం గ్రామ దేవత గ్రామ పుట్టింటి చీరతో అలంకరణ, 12న ఆఖరి రోజు రకరకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద రకరకాల విద్యుత్ కాంతులతో డిజిటల్ లైట్లను ఏర్పాటు చేశారు. పెదవేగి సీఐ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారని, ఆలయంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం అమ్మవారికి విశిష్ట అలంకరణ చేసి పూజలు చేశారు.

గద్దర్‌కు నివాళి


గద్దర్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : దేశ చరిత్రలోనే సాహిత్యాన్ని నటన రూపంలో చూపిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ గుర్తు చేశారు. విప్లవ కవి గద్దర్ 76వ జయంతి సందర్భంగా స్థానిక ఎస్ఆర్‌పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్‌కు నివాళి అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహిత్యాన్ని నటన రూపంలో చూపి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిన గొప్ప గాయకుడు గద్దర్ అని కొనియాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటే మనకు వజ్రాయుధం అని దాన్ని ఎవరూ అమ్ముకోవద్దంటూ ప్రజల్ని పాటల ద్వారా చైతన్యపర్చిన గొప్ప కళా తపస్వి, సాహిత్య వేత్త అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పులవర్తి డేవిడ్, తెనాలి సురేష్, కనికెళ్లి రవి, కనికెళ్లి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	21
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	19

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	60
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	38	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	68
కాకర కాయలు	34-40	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44